# నినాదం

తెలంగాణ ప్రాంతీయం

నిఖార్సైన జర్నలిజం

ఆదివారం 31 ఆగస్టు 2025


## ఎంపీడీవో కార్యాలయంలో ఓటర్ లిస్టు పై అఖిలపక్ష సమావేశం



**జమ్మికుంట, ఆగస్టు 30 (నినాదం) :**
జమ్మికుంట మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో విజయ్ కుమార్ ఆధ్వర్యంలో శనివారం ఓటర్ లిస్ట్ అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వార్డుల వారీగా ఓటర్ జాబితా తయారు చేసిన వాటిల్లో కుటుంబం యూనిట్ గా తీసుకొని రాజకీయ పార్టీల అభ్యంతరాలు స్వీకరించారు. ఓటర్ లిస్టులో ఏమైనా అభ్యంతరాలు ఉంటే తమకు సూచించాలని ఎంపీడీవో అఖిలపక్ష నేతలకు తెలిపారు. ఓటర్ లిస్టులో ఎలాంటి పొరపాట్లు లేకుండా పూర్తి చేసి ప్రతి వార్డులో ఉంచే విధంగా ఏర్పాటు చేయడానికి ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీవో తెలిపారు. కార్యక్రమంలో టిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పింగళి రమేష్ సిపిఎం పార్టీ మండల అధ్యక్షుడు శీలం అశోక్ కాంగ్రెస్ పార్టీ నుండి మండల అధ్యక్షుడు పరశు రామారావు దొగ్గల భాస్కర్ సిపిఐ పార్టీ మండల అధ్యక్షులు గజ్జి ఐలయ్య సమాజ పార్టీ నుండి దాసరపు మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

## ఓయులో గోల్డ్ మెడల్ సాధించిన ముల్కనూర్ యువతి




**భీమదేవరపల్లి ఆగస్టు 30 (నినాదం న్యూస్):**
హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలోని ముల్కనూర్ గ్రామానికి చెందిన మోర సిరి చందన హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీ ఇంజినీరింగ్ కాలేజీ నుంచి బి.టెక్ ఈఈఈ చదివి విశేష ప్రతిభ కనబరిచి రెండు గోల్డ్ మెడల్స్ సాధించింది. ఈ అవార్డులను యూనివర్సిటీ గ్రాడ్యుయేషన్ డే%-%2025 వేడుకల్లో వీసీ ప్రొఫెసర్ కుమార్ ములుగురం చేతుల మీదుగా స్వీకరించింది. చందన యూనివర్సిటీ టాపర్ గా ఒక గోల్డ్ మెడల్, అలాగే ట్రిపుల్ ఈ బ్రాంచ్ ఫస్ట్‌గా మరొక గోల్డ్ మెడల్ అందుకోవడం విశేషం. తన కృషితో ఈ ఘనత సాధించి, కుటుంబానికి మాత్రమే కాకుండా, ముల్కనూర్ గ్రామానికి కూడా గౌరవాన్ని తీసుకొచ్చింది. ఆమె తల్లిదండ్రులు ముల్కనూర్ గ్రామానికి చెందిన ముత్యం ఫొటో స్టూడియోనిర్వాహకులు కుమార్ - లత లు .

## వినాయక నవరాత్రి ఉత్సవాలలో మాదిరి పృథ్వీరాజ్



**జిన్నారం/పటాన్ చెరు ఆగస్టు 30 (నినాదం):**
వినాయక నవరాత్రి ఉత్సవాల సందర్భంగా పటాన్ చెరు నియోజకవర్గ పరిధిలోని వివిధ వినాయక మండపాలను ముఖ్యఅతిథిగా హాజరై అన్నవితరణ చేసిన మాదిరి పృథ్వీరాజ్ బిహెచ్ఎల్ టౌన్‌షిప్‌లో బిహెచ్ఈఎల్ కార్మికులు శ్రద్ధతో నిర్వహించిన గణనాథుని అన్న ప్రసన్న కార్యక్రమంలో పాల్గొని భక్తులతో పాటు పంచాగ్నులను స్వీకరించారు. అలాగే పటాన్ చెరు పట్టణంలోని నందన్ ప్రైడ్, సాయి గణేష్ కాలనీ, బృందావన్ కాలనీ, ఆల్విన్ కాలనీ, ఎండిఆర్ హోమ్స్, గోనెమ్మబస్తి, వాటర్ ట్యాంక్, శాంతినగర్, శ్రీనగర్, శ్రీరామ్ నగర్ కాలనీ తదితర వినాయక మండపాలను సందర్శించి భక్తులతో కలసి అన్నవితరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అన్నదానం మహాదానం. వినాయకుని ఆశీస్సులతో ఈ పుణ్యకార్యంలో భాగం కావడం ఆనందంగా ఉంది. సమాజంలోని ప్రతి ఒక్కరికీ శాంతి, సుఖం, ఆరోగ్యం కలగాలని గణనాథుని ప్రార్థిస్తున్నాను అన్ని తెలిపారు. భక్తులు ఈ సందర్భంలో పృథ్వీరాజ్ ని సత్కరించి, కార్యక్రమంలో పాల్గొనడంపై ఆనందం వ్యక్తం చేశారు.

## అల్లూరి గాంధీ చిత్రపటానికి నివాళులర్పించిన తుమ్మల యుగంధర్




**ఖమ్మం, ఆగస్టు 30(నినాదం):**
సీనియర్ కాంగ్రెస్ నాయకుడు అల్లూరి గాంధీ చిత్రపటానికి రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తనయుడు డాక్టర్ తుమ్మల యుగంధర్ నివాళులర్పించారు. శనివారం నగర పరిధిలోని 54 వ డివిజన్ లో నివాస ఉంటున్న ఆల్లూరి గాంధీ ఇటీవల మరణించినారు. విషయం తెలుసుకున్న యుగంధర్ వారి నివాసానికి వెళ్లి గాంధీ చిత్ర పటానికి నివాళులు అర్పించి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేసినరు. ఆయన వెంట ఖమ్మం మార్కెట్ కమిటీ చైర్మన్ హనుమంతరావు, ఇతర ముఖ్య నాయకులు ఉన్నారు.

## పిఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పలు కుటుంభాలకు ఆర్థిక సహాయం

### -ఏదులాపురం మున్సిపాలిటీలో 46 కుటుంబాలకు సాయం




**ఖమ్మం ప్రతినిధి,ఏదులాపురం ఆగస్టు 30:(నినాదం):**
మున్సిపాలిటీ పరిధిలో జూలై 16 నుంచి ఆగస్టు 29 మధ్య మరణించిన 46 కుటుంబాలకు తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఆదేశాల మేరకు పీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఒక్కో కుటుంబానికి రూ.10 వేల చొప్పున శనివారం ఆర్థిక సాయం అందజేశారు.జలగం నగర్, గుర్రాలపాడు, వెంకటగిరి, గుదిమళ్ళ, తెల్దారుపల్లి, మద్దులపల్లి, బారుగూడెం, ఏదులాపురం, రెడ్డిపల్లి, రాజీవ్ గృహకల్ప, టీఎన్జీవోస్ కాలనీ, ఇందిరమ్మకాలనీ, పెద్దతండా, నాయుడుపేట, ముత్తగూడెం ప్రాంతాల్లోని కుటుంబాలకు ఈ సహాయం చేరింది.కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అలాగే మంత్రి పొంగులేటి అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రథమ స్వాతంత్ర్య సమర చారిత్రక నేపథ్యం

**ఆగస్టు 31... బ్రిటిష్ సైన్యానికి ఢిల్లీ వశమైన దినం**

ఆధునిక భారతదేశ చరిత్రలో బ్రిటిష్ వలస పాలన, విధానాలకు వ్యతిరేకంగా జరిగిన గొప్ప చారిత్రక సంఘటనే '1857 సిపాయిల తిరుగుబాటు'. బ్రిటిషు ఈస్ట్ ఇండియా కంపెనీ... బెంగాలు నవాబు, ఆయన ఫ్రెంచి మిత్రుల కూటమికి 1757 జూన్ 23న ప్లాసీ నిర్ణయాత్మక యుద్ధం జరగగా, తర్వాత వందేళ్లకు ఈ తిరుగు బాటు చోటు చేసుకుంది. దీనినే 'ప్రథమ భారత స్వాతంత్ర్య సంగ్రామం', 'సిపాయిల పితూరి', 'విప్లవోద్యమం'గా చరిత్రకారులు అభివర్ణించారు. వీరసావర్కర్ తాను రచించిన గ్రంథం ఇండియన్ వార్ ఆఫ్




ఇండిపెండెన్స్ లో సిపాయిల తిరుగుబాటు ప్రథమ స్వాతంత్ర్య సమరమని పేర్కొనడం జరిగింది.1857 మే 10 న మీరట్‌లో సిపాయీలతో మొదలైన తిరుగుబాటు, మే 11న సిపాయిలు ఢిల్లీ చేరుకొని చివరి మొగలు చక్రవర్తి బహదూర్ షా నివాసమైన ఎర్రకోటని ఆక్రమించడం, ఈ క్రమంలో తిరుగుబాటు దారుల ప్రధాన సైన్యానికి, బ్రిటిష్ వారికీ ఢిల్లీకి దగ్గరలోని బద్-కీ-సరై లో జరిగిన యుద్ధంలో బ్రిటిష్ సైనికులు మొదట తిరుగుబాటు దారులను ఢిల్లీకి పారద్రోలి తరువాత ఢిల్లీని ఆక్రమించారు. "ఢిల్లీ ఆక్రమణ జూలై 1న ప్రారంభమై ఆగస్టు 31 న పూర్తయింది". తిరుగు బాటుకు ముఖ్య కారణ నేపథ్యాన్ని పరిశీలిస్తే...1856 డిసెంబరులో బ్రిటిష్ పాలకులు రాయల్ ఎన్ఫీల్డ్ (పి/53 లీ ఏన్ఫిల్డ్ రైఫిల్ 557 కాలిబర్) తుపాకీని ప్రవేశ పెట్టారు. దానికి వాడే తూటాల చివరి భాగాన్ని నోటితో కొరికి ఉపయోగించాల్సి ఉండేది. ఈ తుటాల చివర ఆవు పంది కొవ్వు పూసినట్లు వదంతులు వ్యాపించాయి. ఆవు హిందువులకు పవిత్రం, పంది ముస్లింలకు నిషేధం. కాబట్టి తూటాలను కొరకడాన్ని భారతీయ సిపాయిలు నిరాకరించారు. ఈ కొత్తరకం తుపాకులు ఇంగ్లండ్ లో ఆయుధ ఫ్యాక్టరీలో తయారయ్యేవి. ఇది హిందూ, ముస్లిం సైనికులను క్రైస్తవులుగా మార్చడానికి పన్నిన కుట్రగా భావించిన సిపాయిలు తిరుగుబాటుకు పూనుకున్నారు. అయితే బ్రిటీష్ వారు ఆ తూటాలను మార్చామనీ, కొవ్వులను తేనె పట్టునుండి లేదా నూనె గింజల నుండి సొంతంగా తయారు చేసుకోవటాన్ని ప్రోత్సహించామని చెప్పినప్పటికీ అవి సిపాయిలకు నమ్మకాన్ని కలిగించలేక పోయాయి.1857 మార్చినెలలో 34వ దేశీయ పదాతి దళానికి చెందిన మంగళ్ పాండే అనే సైనికుడు బ్రిటిష్ సార్జంట్ మీద దాడిచేసి ఆయన సహాయకుని గాయ పరచాడు.

# మానవాళికి ఆదర్శం...

# రాధాకృష్ణుల ప్రేమ తత్వం

భాద్రపదమాసం లోని అష్టమి శ్రీకృష్ణ పరమాత్మ పూజకు ఉత్కృష్టమైన రోజు. ఈ నాడు పవిత్ర ప్రేమకు చిహ్నంగా చెప్పబడుతూ ఉన్న రాధా కృష్ణులను పూజించడం సాంప్రదాయం. ఈ దినానికి 'రాధాష్టమి' అని పేరు. ఈ రోజు రాధాకృష్ణులను పూజించడం వల్ల సంసార సుఖం లభిస్తుందని, భార్యాభర్తల మధ్య అనురాగం పెరుగుతుందని చెప్పబడుతూ ఉంది. రాధాయ నమః అనే మంత్రాన్ని శ్రీకృష్ణుడు ఆ దేవి నుంచి రాస మండలంలో ఉపదేశ రూపంలో పరిగ్రహించాడని, అదే మంత్రాన్ని గురు పరంపర నుంచి నారదుడు గ్రహించాడని 'పద్మ పురాణం' చెబుతున్నది. రాధ జన్మ వృత్తాంతం గురించి భిన్నగాథలు వ్యాప్తిలో ఉన్నాయి. ఆమె కేదారుడు అనే రాజుకు యజ్ఞ కుండంలో పుట్టిన కుమార్తె అని చెబుతారు. పేరు బృంద అని, కృష్ణుణ్ని భర్తగా పొందాలని కోరి తపం ఆచరిస్తే ఆయన ప్రత్యక్షమ య్యాడని విశ్వసిస్తారు. ద్వాపర యుగంలో రాధ తనను సేవించడం వల్ల ఆ ప్రదేశం 'బృందావనం'గా మారుతుందని వరమిచ్చాడనీ ఆ గాథ సారాంశం. వృష భానుడు, కళావతి దంపతులకు పుట్టిన తనయకు గర్గ మహాముని 'రాధ' అని నామకరణం చేశాడు. బ్రహ్మవైవర్తం ప్రకారం, దూర్వాస ముని 'రసరశ్మి' అని పేరు పెట్టాడు. శ్రీకృష్ణుణ్ని రాధాదేవి తన మనసులో లయం చేసి విజయం సాధించిన రోజు- భాద్రపద శుద్ధ అష్టమి. అందుకే 'రాధాష్టమి'గా వ్యవహరిస్తారు. శ్రీకృష్ణుణ్ని ప్రాణాధారంగా చేసుకొన్న రాధ ఆయన వామ పార్శ్వం నుంచి పుట్టిందని చెబుతారు. ఆమె పుట్టగానే రాస మండలంలో కృష్ణుడి సేవకోసం ధావనం (పరుగు) సాగించడం వల్ల రాధగా మారిందని బ్రహ్మవైవర్త పురాణం వివరిస్తోంది.గోలోకాన్ని మహారాస మండలి అంటారు. నిత్య బృందావనం, శ్వేత మండలి అని కూడా వ్యవహరిస్తారు. అది ఒక మహా రస జగత్తు. ఆ జగత్తుకు ప్రభువు గోపాలుడు. ఆయనే రాధా మాధవుడు. ఆ రస సమ్రాట్ శక్తినే రాసేశ్వరిగా భావిస్తారు. 'రాసము' అంటే గోకులంలోని ఒక క్రీడావిశేషం, సల్లాపం అని అర్థాలున్నాయి. ధావనం అంటే పరుగు. రాధాకృష్ణులు- ద్వంద్వ సమాసం. ఆ మాట వినగానే అద్వైత ప్రణయం గోచరిస్తుంది. అప్రాకృతమైన జగత్తులో- ముక్త ధామం, వైకుంఠం, గోలోకం అనే మూడు ప్రధాన లోకాలు ఉన్నాయని నారాయణోపనిషత్తు వర్ణిస్తుంది. రాధ అంటే భగవంతుని విశేషముగ ఆరాధించునది అని (భక్తి అని ) అర్థము. అనగా అత్యంత భక్తురాలు. కుండలి నుండి మూలాధార వరకు జాలువారుతున్న అమృత బిందువులను (విశ్వశక్తిని) ధారలా భూలోకము నుండి (మూలాధారా) వైకుంఠము (సహస్రారం)నకు తీసుకుని వెళ్ళగలిగే ఒక శక్తి ... ధార ...రాధ ... ఇదో నిరంతర వాహిని ...ఇదే ధ్యానం ...భక్తి ... ప్రేమ...కృష్ణుడనగా ఆకర్షించు వాడని యర్థము. నిరంతరం ఆత్మ అంతర్ముఖం కమ్మంటుంది. కాని మనం అత్మరాత్మ మాట వినం. ఇంద్రియాలు చెప్పినది చేస్తూ ఉంటాము. రాధ యనగా సిద్ధింప చేయునది అని అర్థము (మోక్షం). కృష్ణ (సాధకుడు) ఎక్కడ ఉంటే (నిరంతర) ధార (రాధ) అక్కడ ఉంటుంది. శ్రీకృష్ణుడికి రాధ ప్రాణాధికురాలైన ప్రియురాలు. మహా ప్రకాశ వంతమైన గోలోక రాస మండలంలో రాధాకృష్ణులే ఆది దంపతులు. నాలుక కొన నుంచి పుట్టిన కన్య 'రాధ' కాలాంతరంలో రెండు రూపాలు ధరించిందని పురాణ కథనం. అందులో ఒకటి లక్ష్మి రూపమని, రెండోది రాధ ప్రతిరూపమని భావిస్తారు. భౌతిక భావాలకు, ప్రేమకు ఎటువంటి సంబంధం లేదని రుజువు చేసిన ప్రేమ రాధా కృష్ణులది. వారి ప్రేమ మీరా భాయి దగ్గర నుండి కబీర్ దాస్ వరకు ప్రతి ఒక్కరికీ ప్రేరణనిచ్చి రచనలు చేసేలా ఉసిగొల్పింది. ఈ నాటికీ



ప్రేమికులను లేదా పెళ్ళైన ముచ్చటైన జంటను పోల్చాలి అంటే రాధా కృష్ణుల వలెనే ఉండమని దీవిస్తున్నారు అంటేనే అర్థం చేసుకోవచ్చు. ఈ విశ్వమే అంతమైనా వీరి ప్రేమ మాత్రం మధుర కావ్యంలా ఎప్పటికీ నిలిచి ఉంటుంది. రాధా కృష్ణులు ప్రేమకు స్వచ్ఛమైన రూపం, వారి ప్రేమ హృదయంలో వికసించే పూలతోట వంటిది. ఇంద్రియాలకు చెందిన సాధారణమైన సంబంధం కాదు , అనిర్వచనీయమైనది. ఇప్పటికీ, ఎప్పటికీ చెక్కు చెదరని ప్రేమ అంటే రాధా కృష్ణులే మొదట స్ఫురణకు వచ్చేది. జీవితంలో అన్నిటినీ పొందగలిగిన కృష్ణుడు, ఏదైనా కోల్పోయాడు అంటే అది రాధ ప్రేమనే. అంతగా కృష్ణుని మనసునే కలచి వేసిన అంశంగా రాధ మిగిలి పోయింది.రాధామాధవం ఎంత రమణీయం! రెండు పవిత్ర హృదయాల దివ్య సంగమం, స్వచ్ఛమైన ప్రేమకు అచ్చమైన ప్రతిరూపం. తనను తాను ప్రేమించుకుందుకు, తన నుండి తాను వేరుపడి మాధవుడు రాధగా జన్మించాడు. రాధ లోకోత్తర సౌందర్యమూర్తి. అరవిందం లాంటి అందం. మకరందం లాంటి మనస్సు. ఇలకు దిగిన ఇంద్ర ధనుస్సు. ప్రణయ మాధురి, రాధా సుందరి. మాధవుడు సౌందర్య సారసర్వస్వం. కోటి మన్మధ లావణ్య కోమలాంగుడు. త్రిజగన్మోహన నీలవర్ణ శోభితుడు. సకల సద్గుణ భూషితుడు. నిర్మల హృదయుడు. నిర్గుణుడు. బృందావనంలో, పాల నురగతో సరిగంచులు దిద్దించిన కొత్త చీర ధరించి, విశేషమైన అలంకారాలతో, చందనం పూసిన కుందనపు బొమ్మలా వినూత్న శోభను రాధ విరజిమ్ము తుంటే, ఆమె ఎదురుగా కృష్ణుడు, సహజాలంకార సుందరుడు, రాగరంజితుడు, అనురాగ బంధితుడు రాధ సన్నిధిలో ఏకాంతంలో తన్మయుడై ఉంటాడు. శ్రీకృష్ణుని ప్రియురాలు రాధ జన్మదిన వేడుకలను రాధాష్టమి సందర్భంగా, రాధా కృష్ణుల విగ్రహాలకు పెరుగు, పాలు, పండ్ల రసాలు, పాలు, కొబ్బరినీరు తదితరాలతో అభిషేకాలు నిర్వహించి అనంతరం స్వామి వారిని సర్వాంగ సుందరంగా అలంకరించి భక్తితో గీతాలు ఆలపిస్తారు. ప్రత్యేక పూజ, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. రాధా కృష్ణుల విగ్రహాలను అభరణాలు, నూతన వస్త్రాలతో విశేషంగా అలంక రిస్తారు. బృందావనంలో ముఖ్యమైన ప్రదేశాలను భక్తులకు తెలియజేస్తూ వాటి విశిష్టతతో కూడిన వీడియోను ప్రదర్శిస్తారు. రాధను కీర్తిస్తూ వైష్ణవ ఆచార్యులు స్వరపరిచిన అద్భుత పాటలు ఆలపిస్తారు. అమ్మవారికి విశేష హారతి తర్వాత పవళింపు సేవ నిర్వహిస్తారు. పవిత్ర ప్రేమకు చిహ్నంగా భావించి రాధా కృష్ణులను పూజిస్తారు. రాధా కృష్ణులు ఏకైక రూపులు. రాధా కృష్ణులను ఆరాధించడం వల్ల భార్యాభర్తల మధ్య అనురాగం పెరుగుతుందని విశ్వాసం.

## బిజెపి నాయకులను అరెస్టు చేసిన పోలీసులు



**మల్యాల, ఆగస్టు 30( నినాదం):**
కాంగ్రెస్ నాయకుడు లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ప్రధాని నరేంద్ర మోడీ మాతృమూర్తి పై బీహార్ లో నిర్వహించిన యాత్రలో కించపరుస్తూ అసభ్యకరంగా మాట్లాడాడని మల్యాల మండల బిజెపి నాయకులు రాహుల్ గాంధీ దిష్టిబొమ్మ ను శనివారం మల్యాల ఎక్స్ రోడ్ లో దగ్ధం చేసే ప్రయత్నంలో బిజెపి నాయకులు ఎలాంటి అవాంచనీయ సంఘటనకు దారి తీయకుండా ముందస్తు అరెస్టు చేయడం జరిగిందని మల్యాల ఎస్సై నరేష్ తెలిపారు.అరెస్ట్ అయిన వారిలో పార్టీ అధ్యక్షుడు గాజుల మల్లేశం, జిల్లా ఉపాధ్యక్షుడు బింగి వేణు ,కేల్లేటి రమేష్, రాచర్ల రమేష్, గుండేటి గంగారాం, తదితర కార్యకర్తలు ఉన్నారు.

## పంట కాలం ముగిసిన తర్వాత యూరియా ఇస్తారా రైతుల ధర్నా..



**హుస్నాబాద్ ఆగస్టు 30 నినాదం:**
హుస్నాబాద్ మండలంలో తెల్లారితే చాలు రైతులు వ్యవసాయ పొలం దగ్గరికి వెళ్లకుండా ఎరువుల దుకాణాల ముందు, రైతు మిత్ర, వ్యవసాయ సహకార సంఘం దుకాణాల ముందు తిండి తినక బారులు తీరి నిలిచి ఉండే పరిస్తితి కనబడుతుంది. ఈరోజు హుస్నాబాద్ పట్టణంలో యూరియా దొరకక రైతులు పెద్ద ఎత్తున ధర్నా చేయడం జరిగింది. ఈ నియోజకవర్గంలో నుండి కేంద్ర మంత్రి బండి సంజయ్, మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ గారు ప్రాతినిధ్యం వహించినప్పటికీ సాగుచేసిన పంటలకు ఇప్పటికీ 50 శాతం కూడా ఎరువుల అందిన పరిస్థితి లేదు. వ్యవసాయ శాఖ తప్పిదం, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల తప్పిదాలు దేశంలో ఉన్న రైతులకు గుదిబండగా మారాయని, సబ్సిడీలు ఎత్తివేస్తానికి కేంద్ర ప్రభుత్వం దొంగనాటకాలు ఆడుతుందని పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ %దీ వా ౹ా% పచ్చిమట్ల రవీందర్ గౌడ్ ఆరోపించారు. టిఆర్ఎస్ అధికార ప్రతినిధి మల్లికార్జున్రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల లబ్ధి కొరకే బిజెపి ప్రభుత్వం నానో యూరియా రైతుల అంట పెడుతుందని, రేవంత్ రెడ్డి ప్రభుత్వం రైతుల పట్ల తీవ్ర నిర్లక్ష్యం చేసిందని రాబోయే ఎన్నికలలో రైతులు తైన గుణిపాట ము చెప్పాలని మాట్లాడటం జరిగింది. ఈ సందర్భంగా రైతులు యూరియా పట్ల విఫలమైన కేంద్ర మంత్రి బండి సంజయ్ గారిని, మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ గారిని రాజీనామా చేయాలని మాట్లాడటం జరిగింది. కార్యక్రమంలో నాయకులు మాజీ మున్సిపల్ చైర్మన్ సుద్దాల చంద్రయ్య, టిఆర్ఎస్ పార్టీ అధికార ప్రతినిధి ఐలేని మల్లికార్జున్ రెడ్డి, బీఎస్పీ పార్టీ నాయకులు పచ్చిమట్ల రవీందర్ గౌడ్, ఎలగందుల శంకర్, టిఆర్ఎస్ నాయకులు మేకల వికాస్, రైతులు పాల్గొన్నారు..

# బాలల వికాస తరంగిణి తురగా జానకీరాణి

ఆగస్టు 31... తురగా జానకీరాణి జయంతి

పిల్లలారా రారండోయ్...బాల బాలికలు రారండోయ్... బాలల ప్రోగ్రాం విన రారండోయ్... అంటూ ప్రారంభమై, పాటతో మొదలై... 'పోదామా ఇక పోదామా ఇళ్లకు... మన ఇళ్లకు...అనే ముగింపుతో వినిపించే రేడియోలో ప్రసారమయ్యే బాలానందం కార్యక్రమం కోసం పిల్లలే కాదు...పెద్దలు సైతం ఉత్సాహంతో ఎదిరి చూసిన పాత జ్ఞాపకాలు అయిదు పదుల వయసు దాటిన వారికి చెరిగిపోని జ్ఞాపకాలే. రేడియో అక్కయ్యగా తురగా జానకీరాణి, ఆకాశవాణి ద్వారా నిర్వహించిన పిల్లల కార్యక్రమాలు మరిచి పోలేనివి.ఎందరో చిన్నారులు బాలా నందంలో పాల్గొనే అవకాశం పొంది, తమ కంఠం వినిపించ డం వెనుక ఆమె పాత్ర మరిచి పోలేనిది. పాటలు, నాటికలు, రూపకాలు వంటి ఎన్నో కార్యక్రమాలను రూపొందించి వాటిలో చిన్నారులతో ప్రదర్శింప చేసిన ఆమె కృషి మరిచి పోనిది. ఎందరో ప్రముఖులు తమకు చిన్నతనంలో ఆకాశవాణిలో రేడియో అక్కయ్యతో వున్న అనుభవం మర్చిపోకుండా ఉంటారు.తురగా జనకీరాణి (ఆగస్టు 31, 1936- అక్టోబరు 15, 2014) ఆలిండియా రేడియోలో నేటికీ రేడియో అక్కయ్యగా సుపరిచి తురాలు అయిన ఆమె రచయిత్రి, సంఘ సంస్కర్త ..

ఆకాశవాణి ఉద్యోగంలో చేరక ముందు రేడియో ఆర్టిస్టుగా , రాత్రి 7 నుండి 7.50 వరకు కథానికా పఠనం చేసే వారు. ఆకాశవాణిలో ఆమె అనేక కొత్త ప్రయోగాలు చేశారు. చొప్పదంటు ప్రశ్నలు, బాలవాణి వంటి కార్యక్రమా లు, కంగారు మామయ్య, కొంటె



కృష్ణయ్య, వెర్రి వెంగళప్ప వంటి పాత్రలు ప్రవేశపెట్టి చిన్నారి శ్రోతలకు చేరువ అయ్యారు. వందకి పైగా కథలు రచించారు. అవి మూడు సంపుటాలుగా వెలువ డ్డాయి. మూడు నవలలు, ఐదు బాలసాహిత్యం మీద పుస్తకాలు వచ్చాయి అనువాద రచనలు కూడా మూడు వచ్చాయి. పలు పత్రికల్లో వీరు రచించిన కథలు ప్రచురించ బడ్డాయి. సన్మానం, మంచిమనస్సు, ఉపాయం, వాదన, ఆడపిల్ల వంటి కథలతో కూడిన 'మిఠాయి పొట్లం 'కథల సంపుటి కేంద్ర ప్రభుత్వ సంస్థ 'పబ్లికేషన్స్ డివిజన్' ప్రచురిం చింది. మరో కథల సంపుటి 'బంగారు పిలక 'ని నేషనల్ బుక్ ట్రస్టు వారు ప్రచురిం చారు. రెడ్ క్రాస్ కథను అనువదించారు. ఆకాశ వాణి ద్వారా..."ఇది నా సమస్య" అని స్త్రీల కార్యక్రమం ప్రసారం చేసి స్త్రీలు తమ సమస్యలు ఉత్తరాల ద్వారా తెలియ పరిస్తే వాటి పరిష్కా రాలు నిపుణులైన డాక్టర్లు, లాయర్లు మొదలైన వారిచే చెప్పే కార్యక్రమాల, వృద్ధుల కోసం తమ జీవితానుభవాలు తెలిపే "స్రవంతి" అనే కార్యక్రమం వెనుక జానకీ రాణి కృషి అభినందనీయం. దృశ్యశ్రవణ విధానంతో విజ్ఞానం అందించవచ్చని అమ్మ-పాప, చిలుక పలుకులు, ఉదయబాల, అమ్మా నేను బడికి పోతా, బంగారు పాప వంటి పలు సిడిలను రూపొందించారు. జానకీరాణి సేవలకు గుర్తింపుగా 'సనాతన ధర్మ ', బాలసాహిత్య పరిషత్ ' వంటి పలు సంస్థలు సత్కరించాయి. ఆమె 1991,1992లో వరుసగా రెండు సార్లు నేషనల్ బెస్ట్ బ్రాడ్ క్యాస్టరుగా అవార్డు పొందారు. ఉద్యోగ నిర్వహణలో భాగంగా ఎందరో పేరెన్నిక గల వారితో పని చేశారు .అక్కినేని నాగేశ్వర రావు, ఎస్.పి. బాలసుబ్రహ్మ మణ్యం, జె.వి. సోమయా జులు, మంజు భార్గవి, దేవుల పల్లి కృష్ణశాస్త్రి, స్థానం నరసింహారావు, వేలూరి శివానంద, గోపీచంద్.... ఇలా ఎందరితోనో కలిసి కార్యక్ర మాలు రూపొందించారు.యూనిసెఫ్ లో, ఎన్.సి.ఆర్.టి., ప్రభుత్వ శాఖల కోసం పని చేసేటప్పుడు బాల జాగృతి (బా జా)అనే కార్యక్రమం చేపట్టి 670 (%ర్తీవవ్ ఒష్త్రశీఎం%) వీధి ప్రదర్శనలు చేశారు. బాలల హక్కులు, సమస్యలు, బాల కార్మిక నిర్మూలన, ఇత్యాది ఎన్నో విషయాలపై ప్రజల్లో అవగాహన కల్పించేవాళ్ళు. సామాజిక స్పృహ వున్న విషయాలు, సృజనాత్మక సందేశాలు పిల్లలు, యువతీ యువకులు శిక్షణ పొంది ప్రదర్శించేవాళ్లు. జానకీరాణి... 2011లో బాల సాహిత్య పరిషత్ ద్వారా "బాలసాహిత్య రత్న" అవార్డు, గహలక్ష్మి స్వర్ణకంకణం, రెండు సార్లు తెలుగు విశ్వ విద్యాలయ పురస్కారం, రాష్ట్ర ప్రభుత్వ ఉగాది పురస్కారం, పింగళి వెంకయ్య స్మారక సత్కారం, అరవిందమ్మ మాతృమూర్తి అవార్డు, సుశీల నారాయణరెడ్డి సాహితీ పురస్కారం, ఆంధ్ర సారస్వత పరిషత్తులో పరిణిత వాణి గౌరవం, 'ఈనాడు' అవార్డు, బాలబంధు, దక్షిణ మధ్య రైల్వే గౌరవ సత్కారం... ఎలా ఎన్నో పురస్కారాలను అందు కున్నారు. కొంతకాలంగా మధుమేహ వ్యాధితో బాధ పడుతూ, అక్టోబరు 15, 2014న ఈ లోకాన్ని వదిలి వెళ్ళారు.

# నినాదం

## తెలంగాణ ప్రాంతీయం

నిఖార్సైన జర్నలిజం

ఆదివారం, తెలంగాణ
31 ఆగస్టు 2025




## ఓటర్ల జాబితా సవరణలపై సమీక్షా సమావేశం





**చేవెళ్ల, ఆగస్టు 30 (నినాదం):** చేవెళ్ల మండల పరిషత్ కార్యాలయంలో శనివారం జరిగిన సమావేశంలో మండల అభివృద్ధి అధికారి హిమబిందు అధ్యక్షతన ఓటర్ల జాబితా సవరణలపై సమీక్ష చేపట్టారు. గ్రామపంచాయతీల వారీగా ముసాయిదా, పోలింగ్ స్టేషన్ల పబ్లికేషన్ వివరాలను రాజకీయ పార్టీల ప్రతినిధులకు తెలియజేశారు. ప్రస్తుతం మండలంలో 25 గ్రామపంచాయతీలు, 218 వార్డుల్లో కలిపి 35,437 మంది ఓటర్లు ఉన్నారని అధికారులు వెల్లడించారు. ఒకే కుటుంబ సభ్యులు వేరువేరు వార్డుల్లో ఉన్న అంశాన్ని, అలాగే నాంచేరి, ఇంద్రారెడ్డి నగర్ పోలింగ్ కేంద్రాలపై వచ్చిన అభ్యంతరాలను పరిశీలిస్తామని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికలకు అందరూ సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశానికి ఎస్ఐలు సంతోష్ రెడ్డి, తేజశ్రీ, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

### గణేష్ నిమజ్జనం ప్రశాంత వాతావరణంలో

# జరుపుకోవాలి

### పిఏసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ




**శేరిలింగంపల్లి, ప్రతినిధి, (నినాదం) :** గణేష్ నిమజ్జనానికి భక్తులు, యువకులు పోలీసులకు సహకరించాలని, గణేష్ నిమజ్జనం ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని, సాంప్రదాయ, సాంస్కృతిక నృత్యాలు, భజన సంకీర్తనలతో ముందుకు సాగాలని పిఏసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ సూచించారు. శనివారం వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని మియాపూర్ డివిజన్ పరిధిలోని ఆర్.డి.బి కోకనట్ గ్రో అపార్ట్మెంట్స్, శ్రీల గార్డెన్, మయూరి నగర్ కాలనీలోని ఏ ఆర్ కె టవర్స్ అపార్ట్మెంట్స్, మయూరి నగర్ ధ్యాన మారుతి దేవాలయం, అరబిందో కాలనీ, ఏ.ఎస్ రాజు నగర్, మిత్ర పంచ జన్య అపార్ట్మెంట్స్, జయప్రకాష్ నారాయణ నగర్ కాలనీ, జయప్రకాష్ నారాయణ నగర్ మెయిన్ రోడ్డు, సాయిరాం నగర్ కాలనీ, కృషినగర్ ఏ బ్లాక్, బి బ్లాక్, ఆర్ బి ఆర్ అపార్ట్మెంట్స్ రెండవ బ్లాక్, శ్రీ లక్ష్మీ నగర్ కాలనీలలోని పలు వినాయక మండపాల వద్ద నిర్వహించిన పూజ కార్యక్రమంలో పిఏసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ పాల్గొని కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ తో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవితంలో ఎదురయ్యే విఘ్నాలు తొలగించి విజయాలను దరిచేర్చేవాడు వినాయకుడని, అందుకే ఆయన్ను విఘ్నేశ్వరుడు అంటారని అన్నారు. ఎంతోమంది దేవుళ్లు ఉన్నప్పటికీ మొదట పూజలు అందుకునేది ఆయనే కనుక ఆదిదేవుడుగా కొలుస్తారని తెలిపారు. దేవగణాలకు అధిపతి గణపతిగా పూజలు అందుకుంటున్నాడని, సకల లోకాల సర్వ జనులకు శుభాలు కలిగించే ఆ బొజ్జ గణపయ్య పండుగ వినాయక చవితిని అందరూ ఘనంగా జరుపుకుంటున్నారని తెలిపారు. పండుగను చక్కటి వాతావరణంలో కుటుంబ సభ్యుల మధ్య ఆనందాయకంగా, సంతోషకరంగా జరుపుకోవాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా భవిష్యత్ తరాలను దృష్టిలో పెట్టుకొని సమాజ హితం పర్యవరణ పరిరక్షణలో భాగంగా పర్యావరణ హితం ప్రతి ఒక్కరు మట్టి వినాయకులను పూజించాలని సూచించారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ తో చేసిన వినాయక విగ్రహాల ద్వారా చెరువులు కలుషితం అవుతాయని, పర్యావరణ సమతుల్యత దెబ్బ తింటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## నాయకుల్లారా మా సమస్య పట్టించుకోండి



**అల్వాల్, ఆగస్టు 30 (నినాదం)**
మచ్చ బొల్లారంలోని పంచముఖ హనుమాన్ మందిరంలో డంపింగ్ యార్డ్ జేఏసీనాయకులు సమావేశం నిర్వహించారు. హిందూ స్మశాన వాటికను రక్షించుకోవాలని డంపింగ్ యార్డ్ ఎత్తివేయాలని గత 100 రోజులుగా నిరసన కార్యక్రమంలో చేపడుతున్న మమ్ములను ఎవరు పట్టించుకోవడంలేదని వాపోయారు. సుమారు 53 కాలనీల జేఏసీ నాయకులు మూకుమ్మడిగా కలిసి ఆందోళన ను తీవ్రతరము చేయాలని ఐక్యంగా పోరాడాలనినిర్ణయించుకున్నారు. ఈ కార్యక్రమంలో పడాల సుధాకర్, ఉదయ్, ప్రకాష్, డోలి రమేష్, ఆనందరావు, ఢిల్లీ రమేష్, శ్రీనివాస్ గౌడ్ రెడ్డి, నార్ల సురేష్, ప్రశాంత్ రెడ్డి, కవిత, జేఏసీ నాయకులు సురేందర్ రెడ్డి, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంభానికి ఆర్థిక సహాయం



**వికారాబాద్, ఆగస్టు 30(నినాదం):** మర్పల్లి మండల బి ఆర్ ఎస్ అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి ఆర్థికసాయం వికారాబాద్ మర్పల్లి మండల దామస్తపూర్ గ్రామానికి చెందిన యాచారం యాదప్ప ముదిరాజ్ కూతురు అనారోగ్యం తో చికిత్స పొందుతూ ఇటీవల మృతి చెందింది. ఈ నేపథ్యంలో మర్పల్లి మండలం బిర్ ఎస్ మండల అధ్యక్షుడు శ్రకాంత్ రెడ్డి స్పందించి శనివారం బాధిత కుటుంబానికి 5000 రూపాయలు ఆర్థిక సహాయాన్ని అంధించారు. వారికీ ప్రగాఢ సానుభూతి ని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ సీనియర్ నాయకుడు కల్లెం జైపాల్ రెడ్డి, బి ఆర్ ఎస్ గ్రామ అధ్యక్షుడు ఎల్లా రెడ్డి గ్రామ సీనియర్ నాయకుడు శివ కుమార్ యాదవ్ గ్రామ ఉపాధ్యక్షుడు సల్లద్దీన్, యూత్ అధ్యక్షుడు శేఖర్ రెడ్డిలు ఉన్నారు.

# యూరియా కొరత... రైతుకు గోస!

**ఒక్క బస్తాతో సరిపెట్టుకుంటున్న రైతులు..**

**కొరత లేదంటున్న అధికారులు...**

**కొనసాగుతున్న రైతుల ఆందోళనలు**



**కోదాడ,ఆగస్టు 30(నినాదం):** సాగుకాలం కరిగిపోతుండగా..రైతులకు యూరియా వ్యథలు తప్పడం లేదు. యూరియా కోసం సూర్యోదయానికి ముందు నుంచే రైతులు వ్యవసాయ సహకార సొసైటీల వద్ద, ప్రైవేటు డీలర్ల వద్ద క్యూలు కడుతున్నారు. నిలబడలేని రైతులు పట్టా పాస్ పుస్తకాలు, ఆధార్ కార్డులు, చెప్పులు క్యూల్లో పెట్టి సొసైటీలు తెరిచి యూరియా ఇచ్చేంత వరకు ఎదురుచూస్తున్నారు. రాష్ట్రంలో జూన్ నుంచే ఖరీఫ్ సాగు మొదలు కాగా, జూలై నెలాఖరు నుంచి యూరియా కష్టాలు మొదలయ్యాయి. ఈనెలలో అవి తీవ్రమై, ఎకరాకు ఒక బస్తా ఇచ్చినా చాలు అనే స్థితికి చేరుకుంది. యూరియా కష్టాలకు అధికార యంత్రాంగం పర్యవేక్షణ లోపమే ప్రధాన కారణమని నిపుణులు అంటున్నారు. యూరియా విక్రయాలపై జవాబుదారీతనం లేకుండా మొదట్లో ఇష్టానుసారం విక్రయించినందునే ఇప్పుడు కొరత ఏర్పడిందని కేంద్రం కూడా భావిస్తోంది. గత ఏడాది కన్నా ఈసారి అధికంగానే విక్రయించినప్పటికీ, కొరత రావడానికి ప్రధాన కారణం అధికారులు యూరియా అమ్మకాలపై దృష్టి పెట్టకపోవడమేనని తెలుస్తోంది.

**ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా 109 సహకార సంఘాలు..**
ఉమ్మడి నల్గొండ జిల్లా వ్యాప్తంగా 109 సహకార సంఘాలకు 1,48,983 మెట్రిక్ టన్నుల యూరియా అవసరముందని డిమాండ్ చేయగా 1.04.174 మెట్రిక్ టన్నుల యూరియా మాత్రమే సరఫరా చేశారు. దీంతో సుమారు 44 వేల మెట్రిక్ టన్నుల యూరియా ఉమ్మడి జిల్లాకు ఇంకా రావలసి ఉంది. అదునులో యూరియా చల్లకపోతే వరి, పత్తి, మొక్కజొన్న వంటలలో ఎదుగుదల ఆగిపోతుందని రైతులు ఆవేదన చెందుతున్నారు. పంట ఎదుగుదల సమయంలో యూరియా అవసరం ఎక్కువగా ఉంటుంది. ఈ క్రమంలోనే రైతులు యూరియా కోసం ఎగబడుతున్నారు. ఆందోళనలు చేస్తున్నా రు. అధికారులతో వాదనకు దిగుతున్నారు. ఇది ఇలా ఉండగా సూర్యాపేట జిల్లాలోని హుజూర్నగర్ పట్టణంలో ప్రాథమికవ్యవసాయ పరపతి సహకార సంఘం ముందు బారులు తీరి ఆందోళనకు దిగారు. అదేవిధంగా ఆత్మకూరు ఎస్ మండలం పరిధిలో ప్రధాన రహదారిపై రాస్తారోకో కూడా చేశారు. నడిగూడెం, తెల్లబెల్లి ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘాల ముందు రైతులు ఆందోళన చేపట్టారు. ఒక దశలో పోలీసులు జోక్యం చేసుకొని పరిస్థితిని అదువులోకి తీసుకురావాల్సిన పరిస్థితి నెలకొంది. అనంతగిరి మండలంలో కూడా ఇదే పరిస్థితి నెలకొంది.. శుక్రవారం మునగాల ప్రాథమిక సహకార సంఘం నందు యురియా కోసం రైతులు ఆందోళన చేశారు.

**జిల్లాలో 4.40 లక్షల ఎకరాల్లో వరి సాగు ..**
సూర్యాపేట జిల్లాలో ఈ ఏడాది ఆగస్టులో 31 వేల మెట్రిషన్ల యూరియా సరఫరా చేసామని వ్యవసాయ శాఖ అధికారులు పేర్కొన్నారు. సెప్టెంబర్ మాసంలో జిల్లాకు 50 వేల మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉండగా అదనంగా మరో 116 వేల మెట్రిక్ టన్నుల యూరియా వచ్చే అవకాశం ఉందని అధికారులు అంటున్నారు. జిల్లాలో ఈ సంవత్సరం 4.40 లక్షల ఎకరాల్లో వరి సాగు చేశారు. నాట్లు వేయటం కూడా పూర్తయింది. నానో యూరియా అందుబాటులో ఉన్నప్పటికీ రైతులు మాత్రం ఆసక్తి చూపటం లేదు. భారతదేశంలో తయారయ్యే నో యూరియా వాడితే ప్రభుత్వంపై భారం తగ్గుతుంది. సూర్యాపేట జిల్లాలో 5600 లీటర్ల నానో యూరియా అందుబాటులో ఉందని అధికారులు తెలిపారు. కానీ కొనుగోలు చేసేందుకు రైతులు ముందుకు రావడం లేదు.

**50 వేల టన్నులకు పంపించింది 35 వేలే...**
జిల్లాలో ఆగస్టు మాసంలో 29 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం కాదా 31 వేల మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేసామని వ్యవసాయ శాఖ అధికారులు అంటున్నారు. కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితులు అందుకు భిన్నంగా కనిపిస్తున్నాయి. ఆందోళనలు మాత్రం కొనసాగుతూనే ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వం రాష్టానికి 50 వేల టన్నులు యూరియా ఇస్తామని అంగీకరించగా ఇప్పటివరకు 35 వేల టన్నులు యూరియా పలువురు లక్షల టన్నులు యూరియా వస్తేనే రాష్ట్రంలో యూరియా సమస్యకు పరిష్కారం దొరుకుతుందని రైతులు అభిప్రాయపడుతున్నారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రతిరోజు అధికారులతో సమీక్ష సమావేశాలు నిర్వహిస్తూ పరిస్థితిని తెలుసుకుంటున్నారు. యూరియా కొరత లేకుండా చూడాలని అధి కారులను ఆదేశిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వాన్ని కూడా రాష్ట్ర ప్రభుత్వం తరఫున లేఖ కూడా రాశారు. కేంద్ర ప్రభుత్వం మాత్రం రసాయన ఎరువుల వినియోగం తగ్గించే లో భాగంగా సరిపడ యూరియా అందించడం లేదని పలువురు రైతులు అంటున్నారు.

**భారీ వర్షాలతో నీట మునిగిన పంట..**
ఇది ఇలా ఉండగా భారీ వర్షాలకు జిల్లా వ్యాప్తంగా పలు మండలాల్లో వారి నాట్లు, పొలాలు నీట మునిగాయి. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. నడిగూడెం, మునగాల, చిలుకూరు, అనంతగిరి తదితర మండలాలలోని వలు గ్రామాలలో వరి పైర్లు నీటి వరదకు నీట మునిగాయి. దీంతో రైతులు తిరిగి నాట్లు వేయాల్సిన పరిస్థితి నెలకొంది. పెట్టుబడి పెరుగుతుందని రైతులు వాపోతున్నారు. చెరువుల నుండి అలుగులు పోయటం వరద నీరు వరి పొలాల పైకి ప్రవహించటంతో పూర్తిగా కొట్టుకుపోయాయి. ఇసుకమేట వేశాయి. దీంతో రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఒకవైపు యూరియా కొరత మరోవైపు భారీ వర్షాలు కురవడం పంటలు నష్టపోవడంతో రైతులు సమస్యల వలయంలో చిక్కుకొని సతమతమవుతున్నారు. యూరియా కొరత నివారణకు చర్యలు తీసుకోవాలని జరిగిన వంట నష్టాన్ని అంచనా వేసి వరిహారం అందించాలని రైతులు కోరుతున్నారు.

# 9 అపార్ట్మెంట్ వాసులకు మద్దతు తెలిపిన ఎంపి




- డబ్బు చెల్లించి దశాబ్దం గడుస్తున్న ప్లాట్లు ఇవ్వకుండా భయభ్రాంతులకు గురి చేస్తున్న నిర్మాణదారులు
- మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించిన పార్లమెంట్ సభ్యులు

**కుత్బుల్లాపూర్, ఆగస్టు 30 (నినాదం):** కుత్బుల్లాపూర్ నియోజక వర్గం నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ బాచుపల్లిలో ఫసిఫికా కన్స్ట్రక్షన్ - ఆవాస్ నెబ్యూలా అపార్టుమెంట్ వద్ద కొనుగోలు చేసిన బాధితులు చేస్తున్న ఆందోళనకు మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ సంపూర్ణ మద్దతును తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేట్ కంపెనీలలో పనిచేసే వారు, ఉద్యోగులు, రిటైర్మెంట్ ద్వారా వచ్చిన డబ్బులతో ఈ అపార్ట్మెంట్ లో ఫ్లాట్స్ కొనుక్కున్నారని, కిరాయి ఇంట్లో ఉండి చనిపోతే శవాన్ని రోడ్డు మీద వేసే దుస్థితి రావద్దని సొంత ఇంటికోసం అనేకమంది పరితపించి ఇల్లు కొనుక్కున్నారని పేర్కొన్నారు. అలాంటివారికి పసిపికా కన్స్ట్రక్షన్ ఆవాస్ నెబ్యూలా సంస్థ వారు 2015 లో 2724 మందికి అరచేతిలో వైకుంఠం చూపించి నిర్మాణదారులకు ఈ ఫ్లాట్స్ అంటగట్టారని తెలిపారు. సొంత ఇంటికా నిజం చేసుకొనుటకు అష్ట కష్టాలు పడి కావలసిన డబ్బులు చెల్లించి దశాబ్దం (పదేళ్లు) గడిచిన నిర్మాణదారులు డబ్బులు చెల్లించిన వారికి ఫ్లాట్స్ ఇవ్వకపోవడంతో తీవ్ర మనోవేదనకు గురై ప్రభుత్వ కార్యాలయాలు అధికారుల చుట్టూ, పోలీస్ స్టేషన్ల చుట్టూ తిరిగారు. అమాయక ప్రజల నుండి కోట్ల డబ్బులు గడించిన బిల్డర్లు ఆ డబ్బులతో అధికారులను పోలీసులను మేనేజ్ చేసి, అడ్వకెట్లు పెట్టీ కోర్టు కేసులు వేసి, బౌన్సర్లను పెట్టి భయ బ్రాంతులకు గురి చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చేతిలో ఉన్న డబ్బులు పోయి అవసరమైన ఇల్లు రాకపోవడంతో నిరాశ ఇల్లు కొనుక్కున్నవారు ఆందోళనకు దిగారు. బాధితుల ఆందోళనకు మద్దతు తెలిపిన ఈటెల రాజేందర్ నిర్మాణదారులను, వారి విధానాలను తీవ్రంగా ఖండిస్తూ హెచ్చరించారు. సొంత ఇంటి కల నిజం చేసుకొనుటకు డబ్బులు చెల్లించిన వారందరికీ ఇండ్లు ఫ్లాట్లు అప్పగించాలని, కాదని ఇలాంటి పిచ్చివేషాలు బంద్ చేయాలని, డబ్బుతో దౌర్జన్యం చేస్తా అంటే చూస్తూ ఊరుకోనని హెచ్చరించారు. బీ కేర్ఫుల్. ఇలాంటి పిచ్చి వేషాలు నడవవు. నువ్వు డబ్బులున్నాయని తలచుకుంటే ఏం చెయ్యలేవు. పైసలతో ఏదన్నా మేనేజ్ చేస్తాం అన్న అహంకారం ఉన్న వాళ్ళ చెంప చెల్లుమనిపిస్తాం అని బిల్డర్లకు సూచించారు. బౌన్సర్లు ఎవరిమీదైనా కారణంగా చేయి చేసుకుంటే బౌన్సర్లు వారి కుటుంబాలకు దూరం అవుతారు జాగ్రత్త అన్నారు. బాధితులు కన్స్ట్రక్షన్ లో క్వాలిటీ లేదు అని వాపోతున్నారు. కొత్త ఇంటికి పోతున్నమా పాత ఇల్లు కొనుక్కున్నామా అనే పరిస్థితి ఉన్నదని బిల్డర్ నిర్మాణ దుస్థితిని కొండగట్టారు. నిర్మాణదారులు కనీస సౌకర్యాలు కూడా ఏర్పాటు చెయ్యలేదని బాధితులు ఫిర్యాదు చేయడం బాధాకరమన్నారు. తిరుమల దారుల వద్ద కొనుగోలు చేసిన సొంత ఇంటి కల కోసం ఎదురుచూస్తున్న వారి తరఫున ఒక పార్లమెంట్ సభ్యునిగా ప్రజా నాయకుడిగా నేను కూడా రేరా, ఇతర సంస్థలకు ఫిర్యాదు చేస్తానని బిల్డర్లకు తెలిపారు. నిర్మాణ సంస్థ మర్యాదగా దిగివచ్చి జరిగిన తప్పు గుర్తించి బాధితులకు జరుగుతున్న అసౌకర్యాన్ని గుర్తించి, బాధితులు అందరికీ న్యాయం చేస్తామని హామీ ఇచ్చి డబ్బులు చెల్లించిన వారందరికీ అన్ని సౌకర్యాలతో కూడిన ఇండ్లు నిర్మించి అందించాలని సూచించారు. నిర్మాణ సంస్థ యాజమాన్యం డబ్బులు చెల్లించిన వారికి ఎప్పటి లోగా ఇండ్లు అందజేస్తారో వివరణ ఇస్తూ, పెనాల్టీల పేరుతో డబ్బులు వసూలు చేయడం మానుకోవాలని తీవ్రస్థాయిలో హెచ్చరించారు. 650 ఎస్ ఎఫ్ టి కలిగిన ఇండ్లను (ఫ్లాట్స్) కొనుక్కున్న వాళ్ళు పేద మధ్య తరగతి ప్రజలై ఉంటారని, అలాంటివారిని ఎలా మోసం చేయాలనిపించిందని నిలదీశారు. డబ్బులు చెల్లించినా సొంతింటి కల నిజం కాకపోవడంతో పదేళ్లలో కొంతమంది చనిపోయారని, ఇప్పటికైనా నిర్మాణదారులు స్పందించి డబ్బు చెల్లించిన వారందరికీ న్యాయం చేయాలని లేని పక్షంలో బాధితులకు అండగా ఉండి చివరిదాకా కొట్లాడతామని ఎంపీ వాపోయారు. వ్యాపారంలో విశ్వాసమే పెట్టుబడి అనే విషయం ముఖ్యం అని మర్చిపోవద్దు అన్నారు. నిర్మాణ సంస్థ యాజమాన్యం పెడచెవిన పెడితే జరిగే పరిణామాలకు మీరే బాధ్యత వహించాల్సి ఉంటుంది అని ఈటెల రాజేందర్ హెచ్చరించారు.

# పరిగిలో మహిళ అనుమానస్పద మృతి

**వికారాబాద్, ఆగస్టు 30 (నినాదం ):** వికారాబాద్ జిల్లా పరిగి మండలం మాదారం గ్రామంలో మహిళ అనుమాస్పద మృతి చెందిన సంఘటన శనివారం వెలుగు చూసింది పద్మమ్మ (36) అనుమానాస్పద స్థితిలో అర్థ నగ్నంగా కల్లు కాంపౌండ్ సమీపంలోని సందులో మృతి చెంది పడిఉంది. ప్రతిరోజులాగే శుక్రవారం కూడా పద్మమ్మ రాత్రి కల్లు తాగేందుకు వెళ్ళింది. కల్లు కాంపౌండ్ సమీపంలో సందులో పద్మమ్మ మృతదేహామై కనిపించింది. ఈ దృశ్యాన్ని గమనించిన స్థానికులు పరిగి పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. కల్లు దుకాణం పరిసరాల్లో మహిళ మృతి చెంది పడి ఉండటంతో నిర్వహకుడు నర్సింహులుపై అనుమానం రావడంతో అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్ కు తరలించారు . గత కొన్నేళ్ల క్రితం పద్మమ్మ భర్త నరసింహులు మృతి చెందాడు. ఉన్న ఒక కూతురిని పెళ్లి చేసి పంపించింది. ప్రస్తుతం పద్మమ్మ ఒంటరిగానే ఉంటుంది. ఈ నేపథ్యంలో కల్లు దుకాణం యజమాని నర్సింలు పలుమార్లు పద్మమ్మకు ఫోన్ చేస్తూ ఉండేవాడని దీంతో ఆయనపై మృతురాలి సమీపబంధువులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పద్మమ్మ మృతి పట్ల పూర్తి వివరాలను పోలీసులు సేకరిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసునమోదు చేసుకుని ధర్యాప్తు చేస్తున్నారు.



### బషీరాబాద్ ఎస్‌బిఐలో

# ముసుగు దొంగ



**వికారాబాద్, ఆగస్టు 30 (నినాదం ) :** వికారాబాద్ జిల్లా పరిధిలోని బషీరాబాద్ మండల కేంద్రంలో కొనసాగుతున్న ఎస్ బి ఐ లో శుక్రవారం ముసుగు వేసుకున్న దొంగ బ్యాంకులోపలికి ప్రవేశించిన ఘటన శనివారం కలకలం రేపింది. శుక్రవారం ఎప్పటిలాగే బ్యాంకు సిబ్బంది పనిగంటలు ముగిశాఖ తాళలు వేసి వెళ్ళి పోయారు. శనివారం పని గంటల సమయంలో విధులకు హాజరైన సిబ్బందికీ ధ్వంసమైన గేటు, తలుపులు కనిపించాయి. దీంతో ఎదో జరిగిందని సిబ్బంది వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ ఐ నూమాన్ ఆధ్వర్యంలో ఘటన స్థలాన్ని పరిశీలన చేశారు. అదే విధంగా సీ సీ పూటేజీలను పరిశీలించారు. అందులో ముసుగు వేసుకున్న వ్యక్తి కదలికలను గమనించారు. వెంటనే క్లూస్ టీమును రప్పించి క్షుణంగా ఆధారాలను సేకరించారు. బ్యాంకు మేనేజరు కూడా ఇటీవలే బాధ్యతలు తీసుకున్నారు. బ్యాంకులో ఎం జరిగిందనేది తెలియాల్సి ఉంది. పోలీసులు అన్నికోణాల్లో ధర్యాప్తు చేస్తున్నారు.

### 4వ రోజు కృష్ణ వర్ణంలో

## దర్శనమిస్తున్న సిద్ధి వినాయక స్వామి

**జిన్నారం/పటాన్ చెరు ఆగస్టు 30 (నినాదం)**
సంగారెడ్డి జిల్లా పటాన్ చెరు మండలం రుద్రారం గ్రామంలో ప్రసిద్ధిగాంచిన దేవాలయం గణేష్ గడ్డ నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా ఆలయ ఈవో లావణ్య ఆధ్వర్యంలో 4వ రోజు కృష్ణ వర్ణంలో భక్తులకు దర్శనమిచ్చాడు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నవరాత్రుల సందర్భంగా ప్రతిరోజు స్వామివారికి అభిషేకాలు, అలంకారణాలతో , భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నామని తెలిపారు.



## మోదీకి కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకులు

# రాహుల్ గాంధీ క్షమాపణ చెప్పాలి

**బీజేపీ హుస్నాబాద్ పట్టణ పార్టీ నిరసన, రాహుల్ గాంధీ దిష్టిబొమ్మ దగ్ధంకు యత్నం, అడ్డుకున్న పోలీసులు**

**ఒక్క పేద తల్లి కుమారుడు 11 ఏండ్లుగా దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తుంటే కాంగ్రెస్ పార్టీ జీర్ణించుకోలేక మోదీ మాతృమూర్తి పై దూషణలు చేయడం సిగ్గుచేటు : బత్తుల శంకర్ బాబు**





**హుస్నాబాద్ ఆగస్టు 30 నినాదం :** హుస్నాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మాతృమూర్తి పై కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ బీజేపీ హుస్నాబాద్ పట్టణ అధ్యక్షుడు బత్తుల శంకర్ బాబు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టగా, బీజేపీ నాయకులు రాహుల్ గాంధీ దిష్టిబొమ్మ దగ్ధంకు యత్నం చేయగా, పోలీసులు అడ్డుకున్నారు. కాసేపు పోలీసులకు బీజేపీ నాయకులకు మధ్య తోపులాట జరిగింది. ఈ సందర్భంగా బీజేపీ హుస్నాబాద్ పట్టణ అధ్యక్షుడు బత్తుల శంకర్ బాబు మాట్లాడుతూ బీహార్ రాష్ట్రంలో ఓటర్ అధికార్ యాత్రలో భారత ప్రధానమంత్రి గౌ శ్రీ నరేంద్ర మోదీ మాతృమూర్తి పై కాంగ్రెస్ పార్టీ నాయకులు, రాహుల్ గాంధీ సమక్షంలో దూషణలు చేయడం సిగ్గుచేటు అని అన్నారు. ఈ దేశంలో 11 ఏండ్లుగా ఒక్క నిరుపేద తల్లి కుమారుడు దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తుంటే కాంగ్రెస్ పార్టీ నాయకులు జీర్ణించుకోలేక గౌ. మోదీ తల్లిని దూషణలు చేయడం వారి అహంకారానికి, పరాకాష్టకు నిదర్శనమని అన్నారు. రాజకీయంలో విమర్శ, ప్రతి విమర్శ ఉండాలి తప్ప ఈ రకంగా చనిపోయిన తల్లిని దూషణలు చేయడం ఘోరమైన విషయమని చెప్పారు. రాజ్యాంగానికి విరుద్ధంగా దేశ అత్యున్నత స్థాయిలో ఉన్న భారత ప్రధానమంత్రి మోదీ ని అమర్యాదగా మాట్లాడి, వారి తల్లిని కించపరిచే విధంగా మాట్లాడటం సబబు కాదని హెచ్చరించారు. ఓటు చోరీ పేరుతో దేశ వ్యాప్తంగా ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు తెలంగాణలో కూడా ఓటు చోరీ జరిగి మీరు గెలిచారా అని కాంగ్రెస్ పార్టీని ప్రశ్నించారు. నరేంద్ర మోదీ గారు మచ్చలేని వ్యక్తిత్వం, నిజాయితీగా దేశాన్ని అభివృద్ధి పథంలో పరుగులు పెట్టిస్తుంటే. కాంగ్రెస్ పార్టీ నాయకులకు ఎక్కడ పాలుపోకా ఓట్ చోరీ అని యాత్రలు చేస్తుందని ఎద్దేవా చేశారు. భారత రాజ్యాంగానికి లోబడి ప్రజలు స్వచ్ఛందంగా ఓట్లు వేసి దేశ వ్యాప్తంగా భారతీయ జనతా పార్టీకి బ్రహ్మరథం పడుతుంటే కాంగ్రెస్ పార్టీ నాయకులకు మింగుడు పడటం లేదన్నారు. వెంటనే రాహుల్ గాంధీ గారు భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కి క్షమాపణ చెప్పాలని బీజేపీ హుస్నాబాద్ పట్టణ పార్టీ డిమాండ్ చేస్తూ, హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గోళ్లపెల్లి వీరాచారి, జిల్లా కౌన్సిల్ మెంబర్ కర్ణకంటి నరేష్, బీజేపీ హుస్నాబాద్ పట్టణ ఉపాధ్యక్షులు వేల్పుల నాగార్జున్, కాదాసు దీపికా, ప్రధాన కార్యదర్శులు గాదాసు రాంప్రసాద్, పోలోజు రాజేందర్ చారీ, కార్యదర్శులు బొప్పి శెట్టి సాయిరాం, వడ్డెపల్లి లక్ష్మయ్య, అక్కన్నపేట మండల కార్యదర్శి బానోతు అనిల్ నాయక్, ఎస్టీ మోర్చా మండల అధ్యక్షుడు రైనా నాయక్, బీజేపీ సీనియర్ నాయకులు వేముల దేవేందర్ రెడ్డి, తోట సమ్మయ్య, కురిమెల్ల శ్రీనివాస్, వరియోగుల అనంతస్వామి, అశాడపు శ్రీనివాస్, నారోజు నరేష్, లకవత్ శారద, బీజేపీ నాయకులు విశ్వనాథుల యాదగిరి, బీసా శ్రీకాంత్, రాజు ,తదితరులు పాల్గొన్నారు.

## మోదీ మాతృమూర్తి పై అసభ్యకర, దూషణలు కాంగ్రెస్ కుసంస్కారానికి నిదర్శనం

**రాహుల్ గాంధీ వెంటనే క్షమాపణ చెప్పాలి**

**మాజీ మేయర్ సునీల్ రావు, మాజీ డిప్యూటీ మేయర్ గుగ్గిళ్ళపు రమేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్ బిజెపి నేతల డిమాండ్**



**కరీంనగర్, ఆగస్టు 30(నినాదం) :** కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ బీహార్ లో పాల్గొన్న సభా వేదికపై నుంచి ప్రధాని మోదీ మాతృమూర్తిని దూషిస్తూ , అసభ్యకర వ్యాఖ్యలు చేయడం కాంగ్రెస్ పార్టీ కుసంస్కారానికి నిదర్శనమని బీజేపీ నేతలు మండిపడ్డారు.. ప్రధాని మోదీ తల్లిపై కాంగ్రెస్ వ్యాఖ్యలను నిరసిస్తూ బిజెపి జిల్లా శాఖ, కరీంనగర్ అసెంబ్లీ శాఖ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న బిజెపి నేతలు , మాజీ మేయర్ సునీల్ రావు , మాజీ డిప్యూటీ మేయర్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గుగ్గిళ్ళపు రమేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్ లు మాట్లాడుతూ ప్రధాని మోదీ తల్లి గురించి అసభ్యకర వ్యాఖ్యలు , దూషణలతో కాంగ్రెస్ దిగజారుడు రాజకీయాల స్థాయికి చేరుకుందని విమర్శించారు. ఆ పార్టీ అధినేత రాహుల్ గాంధీ చేస్తున్న పనికిమాలిన రాజకీయాలను చూసి దేశవ్యాప్తంగా ప్రజలు అసహ్యించుకునే పరిస్థితి వచ్చిందన్నారు. మోడీ తల్లి పై రాహుల్ గాంధీ బీహార్లో నిర్వహించిన సభా వేదికగా ప్రధాని మోదీ తల్లిపై దూషణలు తలెత్తినందున ఆయన వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మోడీ తల్లి పేదరికంలో నుంచి వచ్చిన విలువలు నేర్పారని, అందువల్లే మోదీ ప్రధాని స్థాయికి చేరుకున్నారన్నారు. ఒక పేద తల్లి కుమారుడు 11 ఏళ్లుగా ప్రధాని పీఠంపై ఉండడాన్ని కాంగ్రెస్ జీర్ణించుకోలేకపోతుందన్నారు. , మోడీ తల్లిని దూషిస్తూ , కాంగ్రెస్ నేతలు చేసిన అసభ్యకర భాషను ప్రతి ఒక్కరూ ముక్తకంఠంతో ఖండించాలని ఈ సందర్భంగా కోరారు. కొత్తపల్లి మండల రూరల్ శాఖ ఆధ్వర్యంలో రాహుల్ గాంధీ దిష్టిబొమ్మ దహనం. ప్రధాని మోదీ మాతృమూర్తి పై అసభ్యకర భాష ,దూషణల పై కొత్తపల్లి బిజెపి రూరల్ శాఖ భగ్గుమంది. మండల అధ్యక్షులు కుంట తిరుపతి ఆధ్వర్యంలో కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఇట్టి కార్యక్రమంలో పాల్గొన్న కుంట తిరుపతి మాట్లాడుతూ ఒక పేద తల్లి కుమారుడు 11 ఏళ్లుగా ప్రధాని పీఠంపై ఉండడాన్ని కాంగ్రెస్ జీర్ణించుకోలేకపోతుందన్నారు. , మోడీ తల్లిని దూషిస్తూ , కాంగ్రెస్ నేతలు చేసిన అసభ్యకర భాషను ప్రతి ఒక్కరూ ముక్తకంఠంతో ఖండించాలని , రాహుల్ గాంధీ క్షమాపణ చెప్పాలని ఆయన ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షులు కడార్ల రతన్ కుమార్ , కోమటిరెడ్డి అంజన్ కుమార్ సోమినేని కరుణాకర్ బోనాల నరేష్ బైరెడ్డి వంశీ ఇల్లెందుల ఆనంద్ కట్ల శ్రీనివాస్ బోయిన మహేష్ మెరుగు మల్లేశం రాచకొండ అనిల్ విలాసగరం రామచంద్రం మల్లెం నాగరాజు బోనాల అంజన్న తదితరులతోపాటు బూత్ అధ్యక్షులు పాల్గొన్నారు.

## యూరియా కొరత లేకుండా తక్షణం రాష్ట్ర కోటను విడుదల చేయాలి

**తెలంగాణ రాష్ట్ర రైతు సంఘంజిల్లా ప్రధాన కార్యదర్శి గురుజ రామచంద్రం**



**మునుగోడు ఆగస్టు 29 (నినాదం) :** మునుగోడు మండల కేంద్రంలో సిపిఐ, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఆధ్వర్యంలో, రైతులు అంబేద్కర్ చౌరస్తాలో ధర్నా చేపట్టారు. కేంద్ర ప్రభుత్వం పట్ల నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా కార్యదర్శి గురిజ రామచంద్రం ముఖ్య అతిథిగా పాల్గొని కేంద్ర ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలు వలంబిస్తున్నాయని, వ్యవసాయ రంగంపై నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఇప్పుడు రైతులకు అడుగు మందు యూరియా అత్యంత అవసరమని అన్నారు. ఆరుగాళ్ళం కష్టపడి పండిద్దామన్న పంటకు సరైన ఎరువులు, యూరియా అందుబాటులో లేనందున రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణం చొరవ తీసుకొని వ్యవసాయ పరపతి సంఘాలలో రైతులకు సరిపడా అడుగు మందు, యూరియాలను నిల్వ ఉంచాలని,ప్రతి రైతుకు సరిపడా యూరియా అందించాలని డిమాండ్ చేశారు. మరోవైపు అధికారుల వైఫల్యం కారణంగా ప్రైవేటు వ్యక్తులు తక్కువ ధరకు ఉన్న యూరియాను,బ్లాక్ మార్కెట్ తరలించి,అధిక ధరలకు అమ్ముతున్నారని ఆరోపించారు. రైతులు గత్యంతరం లేక ప్రైవేటు వ్యక్తులను ఆశ్రయించాల్సిన అవసరం పరిస్థితినెలకొంద న్నారు. ఇకనైనా కేంద్ర ప్రభుత్వ రైతులకు సరిపడా యూరియా ,అడుగు మందులు నిల్వ ఉంచి రైతులకు సబ్సిడీ మీద ఎరువుల అందించాలని సూచించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఏరియల్ సర్వే చేసి నష్టపోయిన రైతుకు ఎకరాకు 25 వేల రూపాయలు ఇవ్వాలని, రైతులను ఆదుకోవాలని, ఇల్లు కోల్పోయిన వారికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయించి ప్రభుత్వ కట్టించాలని వారి డిమాండ్ చేశారు. తదనంతరం మండల తాసిల్దార్ నేలపట్ల నరేష్ కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మునుగోడు మాజీ జెడ్పిటిసి గోసుకొండ లింగయ్య,మునుగోడు మాజీ వైస్ ఎంపీపీ,వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బొల్గూరి నరసింహ, మండల కార్యదర్శి చాపల శ్రీను, జిల్లా కార్యవర్గ సభ్యులు తీర్పారి వెంకన్న,జిల్లా కౌన్సిల్ సభ్యులు బి. లాలు, రైతు సంఘం మండల నాయకులు బండమీది యాదయ్య, .మందుల పాండు, మండల కార్యవర్గ సభ్యులు వి. వెంకన్న, బీ. మల్లమ్మ, దుబ్బ వెంకన్న,తదితరులు పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబానికి సగర సంఘం నాయకుల పరామర్శ

**జమ్మికుంట, ఆగస్టు 30 (నినాదం) :** వీణవంక మండలంలోని శ్రీరాములపేట గ్రామానికి చెందిన కుర్మిండ్ల స్వామి గత కొద్ది రోజుల క్రితం మృతి చెందాడు. కాగా విషయం తెలుసుకున్న సగర సంఘం కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు దేవు నూరి శ్రీనివాసు సగర, ములుగు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొడిపాక రవిసగర, కురిమిండ్ల మహేందర్ సగర, కరీంనగర్ జిల్లా మాజీ అధ్యక్షుడు ఏరుకొండ ప్రసాద్ గ్రామస్తులతో కలిసి మృతుడి కుటుంబాన్ని శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా మృతుడి చిత్రపటం వద్ద నివాళులర్పించి స్వామి మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే శ్రీరాములపేట గ్రామ సగర కులబంధువులు రూ.14వేలను మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయంగా అందజేశారు. ఇక్కడ శ్రీరామపేట గ్రామ సగర సంఘం అధ్యక్షుడు దేవునూరి రాజేందర్ సగర, ప్రధాన కార్యదర్శి కురిమిండ్ల మల్లయ్య సగర, నాయకులు కురిమిండ్ల సుఖేష్ సగర తదితరులు పాల్గొన్నారు.



## ప్రమాదానికి అడ్డా.. అంగన్వాడీ ముందున్న గుంత..?

**గ్రామ కార్యదర్శికి చెప్పిన పట్టించుకోని వైనం**

**ఆందోళనలో విద్యార్థుల తల్లిదండ్రులు**




**వనపర్తి ప్రతినిధి, ఆగస్టు 30 (నినాదం) :** అంగన్వాడీ కేంద్రం ముందున్న గుంత ప్రమాదానికి అడ్డాగా మారింది.. చిన్నపిల్లలు నీళ్లలో ఆడేందుకు వెళితే వాళ్ళ ప్రాణాలు గాలిలో కలిసి పోవాల్సిందే.. ప్రమాదమని తెలిసి కూడా గ్రామ కార్యదర్శి పట్టించుకోకపోవడంపై పలు విమర్శలు వస్తున్నాయి. వనపర్తి జిల్లా గోపాల్ పేట మండలం పోలికే పహాడ్ గ్రామంలోని చింతల బస్తీలో ఉన్న అంగన్వాడీ కేంద్రం ముందు ప్రమాదకరంగా గుంత ఉంది. గతంలో హెల్త్ సెంటర్ నిర్మాణం సమయంలో భవనం క్యూరింగ్ చేసేందుకు సంపును ఏర్పాటు చేశారని తెలిసింది. పని పూర్తయిన గుంతను పూడ్చలేదు. దీంతో గుంత మొత్తం నీటితో నిండి ప్రమాదకరంగా మారింది. గుంతకు సమీపంలోనే అంగన్వాడీ కేంద్రం ఉందని, చిన్న పిల్లలు అంగన్వాడి కేంద్రానికి ప్రతిరోజు వస్తుంటారని గ్రామస్తులు చెబుతున్నారు. అంగన్వాడీ కేంద్రానికి వచ్చిన చిన్న పిల్లలు నీళ్లు ఉన్నాయని ఆటాడేందుకు వెళ్లారంటే వారి ప్రాణాలు గాలిలో కలవాల్సిందే. ఈ గుంతలో నిల్వ ఉన్న నీరు మురిగిపోయి దోమలు, ఈగలకు ఈ గుంత కేంద్రంగా మారింది. చిన్నపిల్లలు వెళ్తే ప్రాణాలకు ప్రమాదం జరుగుతుందని తెలిసి కూడా గుంతను సంబంధిత అధికారులు పూడ్చకపోవడం నిర్లక్ష్యానికి నిదర్శనంగా కనబడుతుంది.రెండు నెలల నుండి గ్రామస్తులు గ్రామ కార్యదర్శికి ఈ గుంత ప్రమాదకరంగా ఉందని, వెంటనే పూడ్చివేయాలని కోరుతున్న ఇప్పుడు పూడుస్తాం.. అప్పుడు పూడుస్తామంటూ పట్టించుకోవడంలేదని ఆరోపిస్తున్నారు. కండ్ల ముందే ప్రమాదకరంగా ఉన్న గుంతను పూడ్చకపోవడానికి గల కారణంచెప్పాలని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రమాదకరంగా మారిన గుంతను పూడ్చి పిల్లల ప్రాణాలను కాపాడాలని గ్రామస్తులు కోరుతున్నారు

## బోగస్ ఓట్లు తొలగించాలి

**ఆర్డీవో, తహసీల్దార్ కు మూడిమ్యాల గ్రామస్తుల వినతి**



**చేవెళ్ళ ఆగస్టు 30( నినాదం):** బోగస్ ఓట్లు తొలగించాలని ముడుమాల గ్రామ ప్రజలు, తాసిల్దార్ కృష్ణయ్య కు వినతి పత్రం అందజేశారు. శనివారం చేవెళ్ల మండలం మూడిమ్యాల గ్రామ ప్రజలు బీఆర్ ఎస్ సీనియర్ నేతలు గోనె కరుణాకర్ రెడ్డి, నియోజక వర్గ యూత్ అధ్యక్షుడు వంగ శ్రీధర్ రెడ్డి ఆధ్వర్యంలో ఆర్డీవో, తహసీల్దార్, ఎంపీడీవో కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం రిలీజ్ చేసిన ముసాయిదా ఓటరు జాబితా తప్పుల తడకగా ఉందని ఆరోపించారు. గ్రామానికి ఎలాంటి సంబంధం లేని వ్యక్తులను ఓటరు జాబితాలో చేర్చారని , సర్వే నెంబర్లు, ప్లాట్ల నెంబర్ల తో ఓటు హక్కు కల్పించారని విమర్శించారు. ఒక్కో ఇంటి నెంబర్ పై 15 ఓట్ల వరకు ఉన్నాయని, కొన్ని ఇండ్లలో హిందూ, ముస్లిం ఓట్లు ఉన్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే విచారణ జరిపి బోగస్ ఓట్లు తొలగించాలని డిమాండ్ చేశారు. స్పందించిన తహసీల్దార్ ఈ అభ్యంతరాలపై ఫామ్ 7 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుడు శేరి రాజు, నేతలు దర్శన్, ఆరిఫ్, ఊరడి రాములు, వెంకటేష్, గౌడిచర్ల రమేష్, గోనె మాధవరెడ్డి, అనీఫ్ మియా, మహమ్మద్, జూకంటి కృష్ణ, సూర్యాపేట మహేందర్, బ్యాగరి శివ కుమార్, సంకెపల్లి మహేందర్, కమ్మరి మహేందర్, చాకలి రాము, బాలరాజు, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

## కట్టెకోలను సన్మానించిన ఇరువురు గురువులు

**సేవ పురస్కారాన్ని అందజేసిన ఆచార్యులు**

**తెలుగు భాషా ఉత్సవాలలో నరసయ్యకు అభినందనలు**



**ఖమ్మం ప్రతినిధి ఆగస్టు 30:(నినాదం) :** సాహితీ లోకంలో ఉద్దండులైన ఇరువురు గురువులు ఖమ్మం నగరానికి చెందిన ప్రముఖ కవి సీనియర్ జర్నలిస్ట్ కట్టెకోల చిన నరసయ్యను ఘనంగా సన్మానించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నెల్లూరులోని టౌన్ హాలులో ఆగస్టు 29, 30, 31 తేదీల లో మూడు రోజులపాటు సేవ తెలుగు భాష, సాహితీ, సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో తెలుగు భాషా ఉత్సవాలను నిర్వహించారు. ఈ ఉత్సవాలలో భాగంగా రెండు తెలుగు రాష్ట్రాల నుండి హాజరైన కవులతో కవి సమ్మేళనం కార్యక్రమాలు నిర్వహించారు. ఉత్సవాల సమన్వయ కర్తలు కరుణశ్రీ బోరభారతి దేవి, గుండ్లపల్లి రాజేంద్రప్రసాద్, కొణిదెల శోభ నేతృత్వంలో నిర్వహించిన కవి సమ్మేళనంలో కట్టెకోల చిన నరసయ్య "సరిహద్దు సవాల్" శీర్షికన రాసిన కవితను ఆలపించారు. అనంతరం జరిగిన సన్మాన సభలో అనంతపురం శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో నరసయ్యకు గురువులైన తిరుపతి విశ్వవిద్యాలయం రిటైర్డ్ వైస్ ఛాన్స్ లర్, పద్మశ్రీ అవార్డు గ్రహీత, ఆచార్య కొలకలూరి ఇనాక్, కేంద్ర సాహిత్య పురస్కార గ్రహీత, ప్రము ఖ కవి, రచయిత, సాహితీ విమర్శకులు ఆచార్యులు రాచపాలెం చంద్రశేఖరరెడ్డి ఇరువురు కట్టెకోలకు సేవ పురస్కార పత్రాన్ని, మెమెంటోను అందజేసి శాలువా కప్పి ఘనంగా సత్కరిం చారు. సేవ సంస్థ అధ్యక్షులు కంచర్ల సుబ్బానాయుడు తదితర ప్రముఖులు నరసయ్యను అభినందించారు.

## పోక్సో చట్టంపై విస్తృతంగా అవగాహన కల్పించాలి


**హైకోర్టు న్యాయమూర్తి హెచ్.ఎస్.జె అనిల్ కుమార్ జూకంటి**



**వనపర్తి ప్రతినిధి, ఆగస్టు 30 (నినాదం) :** చిన్నపిల్లల రక్షణ భవిష్యత్తు కోసం ఏర్పాటు చేసిన పోక్సో చట్టంపై విస్తృతంగా అవగాహన కల్పించాలని తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి హెచ్.ఎస్.జె అనిల్ కుమార్ జూకంటి అన్నారు. శనివారం వనపర్తి జిల్లాకు విచ్చేసిన తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి హెచ్.ఎస్.జె అనిల్ కుమార్ జూకంటి ని వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి స్థానిక ఆర్ అండ్ బి అతిథి గృహంలో సాదరంగా ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా పోక్సో చట్టంపై విస్తృతంగా అవగాహన కల్పించాలని న్యాయమూర్తి కలెక్టర్ కు సూచించారు. అనంతరం జిల్లా కలెక్టర్, జిల్లా జడ్జి తో కలిసి జిల్లా కేంద్రంలోని నాగవరం శివారులో సర్వే నెంబర్ 200 లో నూతన కోర్టు భవన నిర్మాణానికి ప్రభుత్వం ద్వారా కేటాయించిన 20 ఎకరాల స్థలాన్ని పరిశీలించారు. ప్రతిపాదిత ఆత్మకూరు – పెబ్బేరు బైపాస్ రోడ్డును పరిశీలించిన హైకోర్టు న్యాయమూర్తి బైపాస్ రోడ్డు అలైన్ మెంట్ ను కొంత మార్చాల్సిందిగా జిల్లా కలెక్టర్ ను సూచించారు. వనపర్తి జిల్లా జడ్జి యం.ఆర్. సునీత, అదనపు కలెక్టర్ రెవెన్యూ ఎన్. ఖీమ్యా నాయక్, సీనియర్ సివిల్ జడ్జిలు కళార్చన, రజనీ, అశ్విని, హైకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్, జిల్లా కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కిరణ్ కుమార్, ఆర్డీఓ సుబ్రమణ్యం, రోడ్లు భవనాల ఇంజనీరు దేశ్యా నాయక్ తదితరులు హైకోర్టు న్యాయమూర్తి వెంట ఉన్నారు.

## ఖరీఫ్ వరి ధాన్యం కొనుగోళ్లకు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలి

**జిల్లా అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ ఆదేశం**



**వనపర్తి ప్రతినిధి, ఆగస్టు 30 (నినాదం) :** జిల్లాలో ఖరీఫ్ 2025-26 సీజన్ వరి ధాన్యం కొనుగోళ్ళకి సంబంధిత శాఖల అధికారులు ఇప్పటినుంచే ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ ఖీమ్యా నాయక్ ఆదేశించారు. శనివారం అదనపు కలెక్టర్ తన ఛాంబర్ లో వరి ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి సంబంధిత శాఖల అధికారులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఈ ఖరీఫ్ సీజన్ లో వరి ధాన్యం కొనుగోళ్ల కోసం పిఏసిఎస్, ఐకెపి, మెప్మా ద్వారా 414 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు సిద్ధం చేయాలన్నారు. సన్న రకం, దొడ్డు రకం కలిపి నాలుగు లక్షల 30 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని అంచనా ఉన్నట్లు తెలిపారు. కనీస మద్దతు ధర క్వింటాలుకు గ్రేడ్ ఏ రకం రూ.2389, కామన్ రకం రూ.2369 గా ఉందన్నారు. హార్వెస్టింగ్ మొదలయ్యేనాటికి వరి ధాన్యం కొనుగోలు చేసే విధంగా అన్ని రకాలుగా సిద్ధంగా ఉండాలని ఆయన సూచించారు.

**పీపీసి ఇన్చార్జిలకు కమిషన్ విడుదల..** ఖరీఫ్ 2023 -24 సీజన్ కు సంబంధించి జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు చేసిన పిపిసి ఇన్చార్జిలకు క్వింటాలుకు రూ.32 చొప్పున రూ.6.06 కోట్ల కమిషన్ మంజూరు చేయడం జరిగిందని, అదేవిధంగా రబీ 2023-24 సీజన్ కు సంబంధించి జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు చేసిన పిపిసి ఇన్చార్జిలకు క్వింటాలుకు రూ.32 చొప్పున రూ.2.79 కోట్లు కమిషన్ మంజూరు చేయడం జరిగిందని చెప్పారు. ఇందుకు సంబంధించిన చెక్కులను పౌరసరఫరాల డిఎం, పౌరసరఫరాల అధికారి ఆధ్వర్యంలో సంబంధిత అధికారులకు అందజేశారు. ఈ సమావేశంలో జిల్లా పౌరసరఫరాల అధికారి కాశీ విశ్వనాథ్, పౌరసరఫరాల డిఎం జగన్మోహన్, డి ఆర్ డి ఓ ఉమాదేవి, డీఏవో ఆంజనేయులు గౌడ్, డి సి ఓ, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.